
ఉపాధ్యాయుల అడ్డదారులు



- పదోన్నతులు, బదిలీల కోసం తప్పుడు సమాచారం
- ఎక్కువ వైకల్యం చూపి లబ్ధిపొందే యోచన
- పెళ్లయినా కానట్లు పలువురు మహిళల దరఖాస్తు

బదిలీలు, పదోన్నతులపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్(ఫైల్)



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 18: సమాజంలో ఉపాధ్యాయులు అంటే ఎంతో గౌరవం ఉంది. అలాంటిది కొందరు టీచర్లు వృత్తికే కలంకం తెస్తున్నారు. పదోన్నతులు, బదిలీల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 82 మంది ఉపాధ్యాయులకు విద్యాశాఖ నిబంధనల ప్రకారం అంగవైకల్యం లేకున్నా.. ఉందని చూపి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వారిపై పలు ఆరోపణలు రావడంతో అధికారులు ఇప్పటికే హెచ్చరికలు కూడా జారీ చేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో ఇలాంటి ధ్రువపత్రాలు ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.





ఖాళీల వివరాలను కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న డీఈవో(ఫైల్)

పదోన్నతులు, బదిలీల కోసం తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తున్నారని తెలుస్తోంది. గుండెకు బైపాస్, న్యూరో సర్జరీలు, క్యాన్సర్ చికిత్స చేయించుకున్న వారికి బదిలీల్లో మొదటి ప్రాధాన్యం ఇస్తారు. దాంతో కొందరు ఉపాధ్యాయులు చిన్నపాటి చికిత్స పొందినా.. సర్జరీ అయినట్లు ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి సర్టిఫికెట్లు తెచ్చుకుని దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇక భర్తలు చనిపోయిన, విడాకులు తీసుకున్న మహిళా ఉపాధ్యాయులకూ బదిలీల్లో ప్రాధాన్యం ఉండటంతో పలువురు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు విద్యాశాఖ వర్గాలే చెబుతున్నాయి. దీనిపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఈ విషయమై అధికారులు దృష్టి సారించాలని అర్హులైన దివ్యాంగ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

తప్పుడు ధ్రువపత్రాలు

కొందరు ఉపాధ్యాయులు విలువలు మరిచి..

వారిపై చర్యలు లేవీ?

గత ఏడాది సెప్టెంబరులో జరిగిన గజిటెడ్ ఉపాధ్యాయ బదిలీల్లో పలువురు జీహెచ్ఎంలు తప్పుడు సమాచారం ఇచ్చి లబ్ధి పొందినట్లు తెలుస్తోంది. వారిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. అప్పట్లో ఆర్జేడీ 17 మంది జీహెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. విచారణ కూడా చేయించారు. అందులో పది మంది వరకు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కానీ వారిపై చర్యలు మాత్రం తీసుకోలేదు. దాంతో రాజకీయ, ఉపాధ్యాయ సంఘాల అండ ఉంటే ఏం చేసినా సరి పోతుందనే ధీమాలో తప్పుడు ప్రతాలు సమర్పించే ఉపాధ్యాయులు ఉన్నారని తెలుస్తోంది.

కఠిన చర్యలు తప్పవు

బదిలీలు, పదోన్నతుల్లో ఉపాధ్యాయులు తప్పుడు సమాచారం ఇవ్వొద్దు. ఇస్తే కఠిన చర్యలు ఉంటాయి. తప్పుడు సమాచారం ఇచ్చారని తెలితే సస్పెన్షన్ వేటు వేసేందుకూ వెనుకాడేది లేదు.

- ఎ.రవీందర్, డీఈవో

పెళ్లి అయినా కానట్లు..

మహిళా ఉపాధ్యాయులు కొందరు పెళ్లి అయినా కాలేదని ఆన్‌లైన్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదుల కూడా అందాయని, కానీ వారు చూసీచూడనట్లు వ్యవహరించారని తెలుస్తోంది. పెళ్లి కాని మహిళా ఉపాధ్యాయులు గత ఏడాది సెప్టెంబరులో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. తర్వాత వారు పెళ్లి చేసుకున్నారు. కానీ తర్వాత పెళ్లయినట్లు పత్రాల్లో చూపలేదు. పెళ్లికాని వారి మహిళా ఉపాధ్యాయులకు ట్రాన్స్‌ఫర్‌లో పది ప్లాయింట్లు ఇస్తారు. అందుకోసం వారు పెళ్లయినా కానట్లు చూపించడం సిగ్గు చేటని కొందరు ఉపాధ్యాయులు ఆగ్రహం చేస్తున్నారు. ఇది ఉపాధ్యాయ వృత్తికే కలంకం అని అంటున్నారు.

ఆర్‌ఎంపీల ఇష్టారాజ్యం

- ప్రథమ చికిత్సకు బదులు ఆపరేషన్లు
- వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం
- మామూళ్ల మత్తులో అధికారులు



గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)

గద్వాల క్రైం, జూన్ 18: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆర్‌ఎంపీలు వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సిన వీరు ఇష్టానుసారంగా పరీక్షలు, ఆపరేషన్లు చేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఈ సెంటర్లకు ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే పేరు ఉండాలి. ఆస్పత్రి, క్లినిక్ అని ఉండకూడదు. కానీ బోర్డుపై డాక్టర్ పేరు రాసి, లోపల మాత్రం ఆర్‌ఎంపీలే వైద్యం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా వైద్యాధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి.

ఒక్కో గ్రామంలో మూడు కేంద్రాలు

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా ఆర్‌ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. ఒక్క జిల్లా కేంద్రంలోనే దాదాపు 35 నుంచి 40 దాకా క్లినిక్‌లు ఉండగా, జిల్లా వ్యాప్తంగా ఉన్న 251 గ్రామాల్లో ఒక్కో ఊర్లో రెండు నుంచి మూడు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రథమ చికిత్స కేంద్రాలకు అత్యవసర పరిస్థితిలో రోగులు వస్తే వారికి ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. అనంతరం పీహెచ్‌సీ లేదా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపాల్సి ఉంటుంది. కానీ అలా కాకుండా ఆర్‌ఎంపీలే డాక్టర్లుగా చెలామణి అవుతూ, చికిత్సలు, సర్జరీలు, చివరకు కాన్పులు కూడా చేస్తున్నారు. అంతటితో ఆగకుండా కొంతమందికి గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్‌లూ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత మహిళల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని స్కానింగ్‌లు చేయిస్తూ, నిర్ధారణ కూడా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

అధిక డోస్ మందులు

జిల్లాలోని కేటీదొడ్డితో పాటు పలు మండలాల్లోని ఆర్‌ఎంపీలు తమ వద్దకొచ్చే వారికి రోగాలు త్వరగా నయం కావాలని అధిక డోస్‌తో ఉన్న యాంటిబయాటిక్ మందులను ఇస్తున్నట్లు తెలుస్తోంది. కేటీదొడ్డి మండలంలోని ఆర్‌ఎంపీలు చేసిన వైద్యం వికటిస్తే.. మండల ప్రజలు సమీపంలో రాయిచూర్ జిల్లా ఆస్పత్రులకు వెళ్లి నయం చేసుకుంటున్నారు. ఈ విషయాలపై జిల్లా వైద్యాధికారులు నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో బయట కేవలం మెడికల్ స్టోర్ మాత్రమే ఉండగా, దాని వెనకాల, లోపల ఆర్‌ఎంపీలు క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలు అధికారులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



శాంతినగర్‌లోని ఓ ప్రథమ చికిత్స కేంద్రంలో స్కానింగ్ యంత్రం

ల్యాబ్‌లకూ అనుమతి ఇస్తున్న అధికారులు



వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లోని ఓ ప్రథమ చికిత్స కేంద్రానికి స్కానింగ్ కోసం వచ్చిన మహిళలు(ఫైల్)

జిల్లా వైద్యాధికారులు మామూళ్ల మత్తులో ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాల్లో ల్యాబ్‌లకూ అనుమతి ఇస్తున్నారని తెలుస్తోంది. జిల్లా కేంద్రంతో పాటు జమ్మిచేడు, గట్టు, కేటీదొడ్డి, అనంతపురం, మద్దెలబండ, వెంకటాపురం స్టేజీ, అమరవాయి, పెద్దపల్లి, పలు గ్రామాల్లోని ఆర్‌ఎంపీలకు ల్యాబ్ సౌకర్యం ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో కేవలం ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీలు వచ్చీరాని వైద్యంతో శాంపిల్స్ సేకరించి, తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారు. ఫలితంగా రోగులు ఆందోళనకు గురవుతున్నారు. డబ్బులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని సమాచారం. విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

అధికారుల దాడులతో వెలుగులోకి..



దాడుల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న ఇంజక్షన్‌లు, గ్లూకోజ్ బాటిల్స్(ఫైల్)

- జిల్లా కేంద్రంలోని చింతలపేట కాలనీలో ఉన్న సూరజ్ క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారులు ఈ నెల 11న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ డాక్టర్ కాకుండా ఇతర వ్యక్తులు చికిత్స చేయడాన్ని గమనించి, నోటీసులు జారీ చేశారు.
- వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో డైరక్టర్ మురళి, మౌనిక ప్రజా వైద్యశాల డాక్టర్ ఝాన్సీరాణి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్‌పై జిల్లా అధికారులు ఈ నెల రెండున దాడులు చేశారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 22న గట్టు మండలంలోని కుచ్చినెర్ల, గొర్లఖాన్‌దొడ్డి, కేటీదొడ్డి, నందిన్నె గ్రామాల్లో ఆర్‌ఎంపీలు రోగులకు రక్త పరీక్షలు చేయడంతో పాటు అధిక డోస్ మందులు, ఇంజక్షన్‌లు ఇవ్వడాన్ని అధికారులు గుర్తించారు పలు రకాల మందులు, ఇంజక్షన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

చర్యలు తప్పవు

అర్హత లేని వారు వైద్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇటీవలే జిల్లా కేంద్రంలోని సూరజ్ క్లినిక్‌కు నోటీసులు ఇచ్చాము. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదు. డాక్టర్‌ల పేరుతో ప్రిస్కిప్షన్ రాయడం, పరీక్షలు, సర్జరీలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ శశికళ, డీఎంహెచ్‌వో

భరత్, జక్కాలకు కీలక పదవులు

- దళిత లీడర్లను ప్రోత్సహించే ఉద్దేశంలో బీజేపీ
- పాత పరిచయాలతో జక్కాకు దక్కనున్న మంచి హోదా



భరత్ ప్రసాద్, జక్కా రఘునందర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో బలపడేందుకు భారతీయ జనతా పార్టీ బహుముఖ వ్యూహాన్ని రచిస్తోంది. రాబోయే ఎన్నికల్లో దక్షిణ తెలంగాణలో పాగా వేయాలనుకుంటున్న ఆ పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలను టార్గెట్‌గా చేసుకుని పావులు కదుపుతోంది. అందులో భాగంగా నాయకులు పోతుగంటి భరత్, జక్కారఘునందన్‌రెడ్డిలకు పార్టీ లేదా ప్రభుత్వపరంగా పదవులు కల్పించి, బలోపేతం చేసే దిశగా అధిష్ఠానం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ పరిధిలోని సెగ్మెంట్ల వారీగా ఆయా నాయకుల బలాబలాలు, సామాజిక సమీకరణాలు పరిగణనలోకి తీసుకుని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు..

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, పార్టీని బలోపేతం చేసేందుకు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవల ఎంపీగా పోటీ చేసిన నాయకుడు పోతుగంటి భరత్, జక్కా రఘునందన్‌రెడ్డిలకు బీజేపీ పదవులు కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. వారికి పార్టీ లేదా ప్రభుత్వ పరంగా పదవులు కల్పించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నాగర్‌కర్నూల్‌లో అనూహ్యంగా రెండో స్థానానికి చేరుకుంది. త్రిముఖ పోటీలో ఎవరు విజయం సాధిస్తారో తెలియని పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌ను మూడో స్థానానికి నెట్టి, బీజేపీ అభ్యర్థి భరత్ ద్వితీయ స్థానంలో నిలిచారు. పోలైన ఓట్లల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి 4,065,72 ఓట్లు రాగా, భరత్‌ప్రసాద్‌కు 3,70,658 ఓట్లు వచ్చాయి. 3,21,343 ఓట్లతో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మూడో స్థానంలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఐదు వేల పైచిలుకు ఓట్లతో బీఆర్‌ఎస్ పరాజయం చెందగా, పార్లమెంట్ ఎన్నికల నాటికి కాంగ్రెస్ ఆధిక్యం కనబర్చిన 2,500 పైచిలుకు ఓట్లను మాత్రమే మెజార్టీగా సాధించింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో లక్షా 23 వేల ఓట్లతో మూడో స్థానంలో ఉన్న బీజేపీని ద్వితీయ స్థానానికి చేర్చిన ప్రస్తుత బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను ప్రోత్సహిస్తే ఇంకామెరుగైన ఫలితాలు సాధించవచ్చని అధిష్ఠానం ఆలోచిస్తోంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో అలంపూర్, అచ్చంపేట ఎస్సీ రిజర్వ్‌డ్ కేంద్రాలుగా ఉన్నాయి. బీజేపీలో దళిత యువ నాయకులు తక్కువగా ఉన్న క్రమంలో భరత్‌ప్రసాద్‌ను ప్రోత్సహించాలని, ఆ క్రమంలో జక్కా రఘునందన్‌రెడ్డిని కూడా విస్మరించకుండా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇరువురు నాయకుల వినియోగించుకోవాలని చూస్తోంది. తద్వారా రాబోయే ఎన్నికల నాటికి లబ్ధి చేకూర్చుకోవాలని పార్టీ వ్యూహకర్తలు యోచిస్తున్నారు.

దుఃఖాన్ని దిగమింగి..

- బ్రెయిన్ డెడ్‌తో కుమారుడి మరణం
- అవయవ దానం చేసిన తల్లిదండ్రులు



రాహుల్(ఫైల్)

నారాయణపేట రూరల్, జూన్ 18 : బ్రెయిన్ డెడ్‌తో కన్న కొడుకు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు దుఃఖాన్ని దిగమింగి, అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. నారాయణపేట జిల్లా కేంద్ర మండలం కోటకొండ గ్రామానికి చెందిన యువకుడు రాహుల్ బీటెక్ పూర్తిచేసి జడ్చర్ల సమీపంలోని పోలేపల్లి పారిశ్రామికవాడలో ఉన్న ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు నెలల క్రితమే రాహుల్‌కు వివాహమైంది. అయితే స్వగ్రామమైన కోటకొండకు ఐదు రోజుల క్రితం వచ్చి తిరిగి బైక్‌పై విధుల నిర్వహణ కోసం జడ్చర్లకు బయలుదేరాడు. కోటకొండ శివారు అటవీ ప్రాంతంలో ఆయన ద్విచక్ర వాహనాన్ని అడవి పంది ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు గాయాలపాలైన అతన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. కన్నకొడుకును పోగొట్టుకున్న టైలర్ గోపాల్ దంపతులు దుఃఖాన్ని దిగమింగి కుమారుడు రాహుల్ అవయవాలు ఇతరులకు ఉపయోగపడతాయని దానం చేశారు. తమ కష్టం ఇతరులకు రాకుండా మరో నాలుగు కుటుంబాల్లో వెలుగులు నింపాలనే తపనతో కుమారుడి అవయవాలను దానంచేసి ఆ దంపతులు ఆదర్శంగా నిలిచారు. రాహుల్ మృతదేహాన్ని స్వగ్రామమైన కోటకొండకు తీసుకువచ్చి కన్నీటిపర్యంతం మధ్య మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. దానాల్లో గొప్ప దానమైన అవయవ దానం చేయడం వల్ల అత్యవసర సమయాల్లో మరొకరి ప్రాణాలు కాపాడి వారికి పునఃజన్మనిచ్చిన వారమౌతామనే ఆలోచనతో ముందుకు వచ్చిన బాధిత తల్లిదండ్రులను పలువురు కొనియాడారు.

వనపర్తి ప్రజలు నా గుండెల్లోనే ఉంటారు



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 18: వనపర్తి జిల్లా ప్రజలు ఎప్పటికీ నా గుండెల్లోనే ఉంటారని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధ్యక్షతన జిల్లా అధికారులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ భావోద్వేగంతో ప్రసంగించారు. ప్రభుత్వ అధికారిగా ప్రతీ ఒక్కరు ప్రజలకు అత్యున్నత సేవలు అందించాలని సూచించారు. ప్రతీ అధికారి నిత్యం ఎంత మందికి సేవ చేశాం.. ఇంకా ఎంత మందికి చేయాలనే సంకల్పం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజాసేవ చేసే అవకాశం పొందిన మనం ఎక్కడి నుంచి వచ్చాము. ఇంకా గమ్యాన్ని చేరుకునేందుకు ఎంత దూరం ప్రయాణించాలనే విషయాల్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తికి మనం తప్ప అతన్ని ఆదుకోవడానికి ఎవరూ లేరు అని భావించి సేవ చేయాలన్నారు. కలెక్టర్‌గా వనపర్తి జిల్లా ప్రజలకు సేవ భాగ్యం దక్కినందుకు చాలా గొప్పగా భావిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో తాను ఎక్కడ ఉన్న వనపర్తి జిల్లా ప్రజలు తన గుండెల్లో ఉంటారని కంట తడి పెట్టుకున్నారు. అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులు, తమ సిబ్బందితో కలిసి కలెక్టర్ దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాలతో సత్కరించారు. జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు కలెక్టర్ దంపతులను ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి వీడ్కోలు పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ రామదాసు, జడ్పీ సీఈవో యాదయ్య, టీజీవో అధ్యక్షుడు సురేష్, టీఎన్జీవో అధ్యక్షుడు అశోక్, ట్రెసా అధ్యక్షుడు మల్లికార్జున, అధికారులు పాల్గొన్నారు.

53 వేల మంది విద్యార్థులకు బూట్లు

- సొంత నిధులు రూ.25 లక్షలతో అందజేస్తానన్న జడ్చర్ల ఎమ్మెల్యే



జడ్చర్లలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత నిధులతో అందించే బూట్లను చూపిస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జూన్ 18 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 53 వేల మంది విద్యార్థులకు తన సొంత నిధులతో బ్రాండెడ్ కంపెనీ బూట్లను రెండు నెలల్లో అందజేయనున్నట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా హిత పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా నవాబ్‌పేట నుంచి బాలానగర్‌కు వెళుతున్న సందర్భంలో చెప్పులు లేకుండా పాఠశాలలకు వెళుతున్న చిన్నారి విద్యార్థులను గమనించానని, ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సొంత ఖర్చుతో బూట్లు ఇప్పిస్తానని మాట ఇచ్చానని చెప్పారు. నియోజకవర్గంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాల, బాలికలు 53 వేల మంది ఉన్నట్లుగా నివేదికలతో తెలిసిందని తెలిపారు. వారందరికీ సరిపడ బూట్లకు రూ.25 లక్షలు అవసరం అవుతున్నాయని చెప్పారు. కంపెనీ నిర్వాహకులు పాఠశాలలకు వెళ్లి, బూట్ల సైజు తెలుసుకొని అక్కడే అందజేసేలా మాట్లాడినట్లు తెలిపారు. నియోజకవర్గ, మండల కమిటీల ద్వారా పంపిణీ చేపట్టనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం స్పోర్ట్స్ షూ త్వరలోనే అందజేస్తానని తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

గోపాల్‌పేట, జూన్ 18 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఏదుల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గోపాల్‌పేట ఏఎస్సై చంద్రశేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏదుల మండల కేంద్రానికి చెందిన బోయిని కురుమయ్య(41) హైదరాబాద్‌లోని లింగంపల్లి వద్ద కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఏదుల గ్రామంలోని చిన్నకూతురు ఇంట్లో ఎల్లమ్మ పండుగ కోసం వచ్చిన కురుమయ్య మంగళవారం ఉదయం గ్రామంలోని కొతంమోని బావిలో చేపలు పట్టేందుకు కుమారుడు, అల్లుడితో కలిసి వెళ్లాడు. చేపలు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు వల కాలుకు చుట్టుకోవడంతో కురుమయ్య నీటిలో మునిగి పోయాడు. గమనించిన కుమారుడు, అల్లుడు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. మృతుడికి భార్య కృష్ణమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పర్వతాపూర్‌లో పెంకుటిల్లు దగ్ధం

ఖిల్లాఘణపురం, జూన్ 18 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం పర్వతాపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఓ పెంకుటిల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు, నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట పాత్రలు పూర్తిగా కాలిపోయాయి. మంటలను గమనించిన ఇరుగుపొరుగు వారు నీళ్లు చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. బాధితురాలు గొల్ల బైకని అలివేల భర్త గొల్ల బైకని వెంకటయ్య మూడు సంవత్సరాల క్రితం మరణించడంతో ఆమె ఒక్కరే పెంకుటిల్లులో నివాసముంటోంది. బాధితురాలి ఇద్దరు కూతుళ్లకు వివాహమైంది. అలివేల ఇంటి నుంచి బయటకు వెళ్లగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పెంకుటిల్లు దగ్ధం కావడంతో ఆమెకు నిలువ నీడ లేకుండాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



పెంకుటిల్లు దగ్ధం కావడంతో కూలిపోయిన పైకప్పు

తాగిన మైకంలో విద్యుత్ స్తంభం పైకి ఎక్కి వ్యక్తి హల్‌చల్

మరికల్, జూన్ 18 : నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో ఓ వ్యక్తి తాగిన మైకంలో విద్యుత్ స్తంభం పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జిన్నారం గ్రామానికి చెందిన కృష్ణయ్య మంగళవారం సాయంత్రం మరికల్‌లో మద్యం తాగాడు. తాగిన మైకంలో పోలీస్‌స్టేషన్ ముందున్న 11 కేవీ విద్యుత్ స్తంభం పైకి ఎక్కాడు. గమనించిన సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్సై మురళి వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అక్కడే ఉన్న పెద్దచింతకుంట గ్రామానికి చెందిన శ్రీకాంత్‌యాదవ్ అనే యువకుడు విద్యుత్ స్తంభం ఎక్కి తన చాకచక్యంతో కృష్ణయ్యను కిందకు దించాడు. జిన్నారం గ్రామస్థుల ద్వారా కృష్ణయ్యను అతని ఇంటికి పంపించారు. వ్యక్తి ప్రాణాలు కాపాడిన శ్రీకాంత్‌యాదవ్‌ను సీఐ, ఎస్సై అభినందించారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య


మల్లేష్(ఫైల్)

బిజినేపల్లి, జూన్ 18 : ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పోలేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సి.మల్లేష్(25) హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి స్నేహితుడి బైక్ తీసుకొని స్వంత గ్రామం పోలేపల్లికి వచ్చాడు. ఇంటికి తాళం వేసి ఉండడంతో తల్లి రంగమ్మకు ఫోన్ చేశాడు. పర్వతాపూర్‌లోని తన తమ్ముడి ఇంటి వద్ద ఉన్నానని ఆమె చెప్పడంతో తల్లి వద్దకు వెళ్లాడు. అక్కడ తల్లితో గొడవ పడిన మల్లేష్ ఇంటికి వెళ్దామని చెప్పడంతో ఆమె నిరాకరించింది. దీంతో బైక్‌పై ఒక్కడే పోలేపల్లికి తిరిగి వచ్చాడు. రాత్రి మద్యం బాగా తాగి క్షణికావేశంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు వివరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, జూన్ 18 : రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి(58) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్సై అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాలోని దివిటిపల్లి-మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి ఎడమడొక్కపై పుట్టుమచ్చ ఉంది. క్రీమ్‌కలర్ నీలిరంగు కలిగిన ఫుల్‌షర్ట్, నీలిరంగు నైట్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'గాలి' కొదిలేశారు..


శ్రీనివాసకాలనీలోని ఓ పెట్రోల్‌పంపులో పనిచేయని గాలిపంపు

- పెట్రోల్ బంకుల్లో పనిచేయని గాలిపంపులు
- ప్రభుత్వ నిబంధనలు అమలు చేయని యాజమాన్యాలు
- పట్టించుకోని అధికారులు
- నిలువుదోపిడీకి గురవుతున్న వినియోగదారులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 18 : పెట్రోల్‌బంక్‌ల యాజమాన్యాలు గాలిపంపులను గాలికొదిలేశాయి. ప్రతీ వినియోగదారులకు కచ్చితంగా గాలి నింపే సౌకర్యాన్ని ఉచితంగా ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికి ఆయా యాజమాన్యాలు అమలు చేయడం లేదు. అయితే బయటి గాలిపంపుల్లోనైనా గాలి నింపుకుందామంటే దోపిడీ జరుగుతోంది. ప్రతీ వాహనానికి ఒక్కో టైర్‌కు రూ.10 వరకు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. అయినప్పటికి ఆయా పెట్రోల్ కంపెనీల సేల్స్ ఫీల్డ్ ఆఫీసర్లు పట్టించుకోవడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు రూరల్ ప్రాంతాల పరిధిలో ఐఓసి, హెచ్‌పీ, భారత్ వంటి కంపెనీలకు సంబంధించి మొత్తం 25 వరకు పెట్రోల్‌బంకులు ఉన్నాయి. ప్రతీ బంకులో టాయ్‌లెట్లు, గాలిపంపులు ఉన్నాయి. అందులో టాయ్‌లెట్లు పనిచేస్తున్నప్పటికి గాలిపంపులు మాత్రం పనిచేయడం లేదు. అవి అలంకారప్రాయంగా మారాయి. ఎప్పుడు చూసినా ఈరోజే పనిచేస్తలేవని చెప్పి వినియోగదారులను వెనక్కి పంపిస్తున్నారు.

నిబంధనలు గాలికి..

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ కంపెనీకి సంబంధించిన పెట్రోల్‌బంకుల్లో వినియోగదారులకు టాయ్‌లెట్లు, గాలి సౌకర్యం కల్పించాలని నిబంధన ఉంది. ఇందుకోసం ఆయా కంపెనీలకు ప్రభుత్వం డబ్బులు కూడా చెల్లిస్తుంది. అందువలన ఉచితంగానే వారికి గాలి, టాయ్‌లెట్ల సౌకర్యం కల్పించాలి. అయితే జిల్లా కేంద్రంలోని ఏ పెట్రోల్ బంకుల్లో గాలి సౌకర్యం కల్పించడం లేదు. చాలావరకు బంకుల్లో గాలి నింపుకోవడానికి వెళితే పంపు పనిచేయడం లేదని, లేదంటే ఎక్కడ పెట్రోల్ వేయించుకుంటారో అక్కడికే వెళ్లండని దురుసుగా సమాధానం చెబుతున్నారు. అయితే దీనిపై ఫిర్యాదు చేయడానికి ప్రతీ బంకులో సేల్స్ ఆఫీసర్, ఫీల్డ్ ఆఫీసర్‌కు సంబంధించిన ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలి. కాని అవి కూడా ఏర్పాటు చేయడం లేదు. అంతేకాకుండా ప్రతీనెల ఆయా కంపెనీల అధికారులు తనిఖీలు కూడా చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా ఆయా ఆఫీసర్లకు పెట్రోల్‌బంకుల యాజమాన్యాలు నెలవారి వసూళ్లు ఇవ్వడం వలన ఏమీ అనలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ఆడిందే ఆటగా సాగుతున్నాయి.

బయటి గాలిపంపుల్లో దోపిడీ

ఇదివరకు బయటి గాలిపంపుల్లో ఏదైనా వాహనం టైర్‌కు రూ.5 వసూలు చేసేవారు. కాని ఇటీవల వారు అమాంతం రూ.5 పెంచేశారు. టైర్‌కు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇదేంటని అడిగితే అంతే అంటూ సమాధానం చెబుతున్నారు. అన్ని గాలిపంపుల యజమానులు సిండికేట్‌గా మారి ఒక్కో టైర్‌కు రూ.10 వరకు వసూలు చేస్తున్నారు. ఏదైనా అంటే కరెంటు చార్జీలు పెరిగినందుకే మేము పెంచామని దబాయిస్తున్నారు. ఫలితంగా వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సివిల్ సర్వీసు పరీక్షకు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 18 : సివిల్ సర్వీసు 2025 సంవత్సరంలో పరీక్ష రాసే అభ్యర్థులకు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఏ.స్వప్న, బీసీ అభివృద్ధి జిల్లా అధికారి ఆర్.ఇందిర మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ పొందే అభ్యర్థులు ఏదేని డిగ్రీ పాసై ఉండాలని పేర్కొన్నారు. అర్హులు, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 19 నుంచి తమ పేర్లను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-2కు గ్రాండ్ టెస్టు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూన్ 18 : బీసీ స్టడీ సర్కిల్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో గ్రూప్-2కు సంబంధించి వచ్చేనెల 8 నుంచి 31వ తేదీ వరకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఏ.స్వప్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తామని, ఒక్కో పరీక్షలో నాలుగు పేపర్లు ఉంటాయని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 19 నుంచి వచ్చేనెల ఐదో తేదీ లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


ఆంజనేయులు (ఫైల్)

బిజినేపల్లి, జూన్ 18 : ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూర్ గ్రామానికి ఆంజనేయులుగౌడ్(30) ఈనెల 11వ తేదీన గ్రామంలో బైక్‌పై తిరుగుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తలకు తీవ్ర గాయాలు కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో ప్రథమచికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతున్న ఆంజనేయులుగౌడ్ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి తల్లి, తండ్రితో పాటు, సోదరుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..

నవాబ్‌పేట, జూన్ 18 : బైక్‌పై నుంచి జారి పడి ఓ బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కేశవరావుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మాధవీలత దంపతులకు చెందిన కుమారుడు రాజేష్‌కుమార్(8) ఈనెల 16న తన సొంత బాబాయి శేఖర్‌తో కలిసి మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పొలం నుంచి ఇంటికి తిరిగి బైక్‌పై వస్తుండగా గ్రామ సమీపంలో బైక్‌పై నుంచి జారి పడి కిందపడ్డాడు. దీంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం పది గంటల ప్రాంతంలో మృతి చెందాడు.

బావిలో పడి మహిళ మృతి

నవాబ్‌పేట, జూన్ 18 : దాహం తీర్చుకునేందుకు బావి వద్దకు వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు మూర్ఛ రావడంతో అందులో పడి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కేశవరావుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జెట్టిగారి లావణ్య(30) మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో సొంత వ్యవసాయ పొలంలోని వ్యవసాయ బావి పక్కన ఉన్న ఇప్ప చెట్టు కింద ఇప్పపువ్వు ఏరుతుండగా దాహం వేసింది. దాహం తీర్చుకునేందుకు బావిలోకి దిగి నీళ్లు తాగుతుండగా ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అందులో పడిపోయింది. లావణ్య ఇంటికి రాకపోవడం గమనించిన కుటుంబ సభ్యులు పొలం వద్ద చూడగా కానరాలేదు. బావిలో చూడగా శవం కనిపించడంతో బయటకు తీశారు. మృతురాలికి ఓ కుమారుడు, భర్త వెంకటేష్ ఉన్నారు.

మద్దూర్ పరిసరాల్లో చిరుత సంచారం

- మండల వాసుల్లో భయం.. భయం
- హాని కలిగిస్తే భారీ జరిమానా అని ఫారెస్ట్ అధికారుల హెచ్చరిక బోర్డు

మద్దూర్, జూన్ 18 : మండలంలో చిరుతల సంచారం సంచలనం రేకెత్తిస్తోంది. ఇటీవలే నందిగామ గుట్టల్లో సంచరిస్తున్న చిరుతను ఫారెస్ట్ అధికారులు బోను ఏర్పాటు చేసి పట్టుకోగా, మరొకటి నందిపాడ్ శివారులోని మల్కిజాదరావుపల్లి గుట్టలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తాజాగా మండలంలోని చెన్నారెడ్డిపల్లి, మోమినాపూర్ శివారులో చిరుత సంచరిస్తుందని ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని ఫారెస్ట్ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడంతో మండలవాసుల్లో చిరుతల భయం పట్టుకుంది. కాగా గతంలో అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి చెందడం పట్ల అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు సంచరిస్తున్న చితరులతో అప్రమత్తంగా ఉండాలే తప్ప పొలం కంచెలకు విద్యుత్ షాక్ పెట్టడం, విష ప్రయోగాలు చేసి చిరుతల మరణానికి కార ణమైతే వారికి రూ.10 లక్షల జరిమానాతో పాటు కేసులు కూడా చేయ డం జరుగుతోందని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా పరిసర ప్రాంతాల్లో చిరుతలు సంచరించడం మండల రైతులకు కంటినిండా కునుకు లేకుండా పోతోంది.

ఎక్కడ తన పశువుల సంపదకు హాని కల్గిస్తాయో, తమ ప్రాణాలు బలి గొంటాయోనన్న భయం మండల వాసుల్లో వెంటాడుతోంది. ఫారెస్ట్ అధికారులు మం డల పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతలను పట్టుకొని అమ్రాబాద్ అడవుల్లో వదలాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 18 : ఆర్టీసీలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కారుణ్య నియామకాల ప్రక్రియను మొదలు పెట్టామని ఉమ్మడి జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వి.శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 10 ఆర్టీసీ డిపోల్లో విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది, మెడికల్ రిటైర్మెంట్ అయిన ఉద్యోగస్తుల వారసులకు ఈ కారుణ్య నియామకాలను ఈనెల 20వ తేదీ నుంచి 22 వరకు ఆర్ఎం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కాల్‌లెటర్లను సంబంధిత చిరునామాలకు పోస్టు ద్వారా పంపించినట్లు ఆమె చెప్పారు. మొత్తం 120 కండక్టర్, డ్రైవర్ల పోస్టులను ముగ్గురు అధికారుల సెలక్షన్ కమిటీ ద్వారా ఈ నియామకాలను చేపట్టినట్లు తెలిపారు. ఖాళీలను బట్టి జిల్లాలోని వివిధ డిపోలకు పోస్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సరదా కోసం వచ్చి అనంతలోకాలకు..

- వాహనం బోల్తా పడి ఒకరి మృతి, ఇరువురికి గాయాలు
- మూలమల్ల గ్రామ శివారులో ఘటన


మృతి చెందిన రోషన్


ఘటనా స్థలం వద్ద స్కార్పియో

ఆత్మకూరు, జూన్ 18 : సరదాగా జూరాల ప్రాజెక్టును సందర్శించేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని పాన్‌గల్ మండలం బీసీ కాలనీకి చెందిన రోషన్(23), శేఖర్, శ్రీకాంత్, సాయి, వంశీ, శరత్, మోహన్ ఏడుగురు కలిసి స్కార్పియో వాహనంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును సందర్శించేందుకు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో బయలుదేరారు. మధ్యాహ్నం ప్రాజెక్టు వద్దకు చేరుకున్న వారు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో సరదాగా తిరిగారు. భోజనాలు ముగించుకుని పరిసర ప్రాంతంలో ఉన్న చెట్ల కింద సేద తీర్చుకున్న అనంతరం ఏడుగురు తిరుగు ప్రయాణమయ్యారు. ప్రధాన ఎడమ కాలువపై ఉన్న రోడ్డులో వస్తుండగా ఒక్కసారిగా వాహనం టైరు పగిలిపోవడంతో మూలమల్ల గ్రామ శివారులోని రామన్నగౌడ్ వ్యవసాయ పొలం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనం కింద రోషన్ పడి నలిగిపోయాడు. సహచర మిత్రులు వెంటనే వాహనాన్ని తప్పించి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే రోషన్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సహచరుల సమాచారం మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై అదుపు తప్పిన ట్యాంకర్

- ఇద్దరికి గాయాలు


కుడివైపు రోడ్డు కిందకు దూసుకెళ్లిన ట్యాంకర్

రాజాపూర్, జూన్ 18 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామ శివారులోని స్థానిక జాతీయ రహదారి-44పై లారీ ట్యాంకర్ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న ఖాళీ డీజిల్ లారీ ట్యాంకర్ అదుపు తప్పి రోడ్డు అవతలివైపు (కుడివైపు) కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో ట్యాంకర్ లారీలో ప్రయాణిస్తున్న ఓ మహిళతో పాటు, ట్యాంకర్ డ్రైవర్ హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయాలపాలైన ఇద్దరినీ 108లో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనలో జాతీయ రహదారిపై అవతలివైపు ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు



చిన్నచింతకుంట, జూన్ 18 : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ సమీపంలోని శ్రీకురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి హుండీని మంగళవారం లెక్కించారు. హుండీ ద్వారా నెలరోజులకు గాను ఆలయానికి రూ.నాలుగు లక్షల 66వేల 646 ఆదాయం సమకూరింది. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారి ఆలయ ప్రాంగణంలో హుండీని లెక్కిస్తున్న భక్తులు

కల్వకుర్తిలో ఎక్సైజ్ దాడులు

- 34 లీటర్ల సారా స్వాధీనం
- 1300 లీటర్ల బెల్లం పానకం పారబోత
- ఎనిమిది కేసులు నమోదు

కల్వకుర్తి, జూన్ 18 : కల్వకుర్తి ఎక్సైజ్ పోలీస్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల పరిధిలో నిర్వహించిన దాడుల్లో 34 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1300 బె ల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు, ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్ట ణంతో పాటు, మండలంలోని తర్నికల్, వెల్దండ మండల పరిధిలోని మైసమ్మ పలుగుతండా, చిన్నాతండా, మర్రికుంటతండా, గాజులోని బండతండా, నెమలిగుండుతండా, పెరుమాలకుంట తండాల్లో దాడు లు నిర్వహించినట్లు చెప్పారు.

దాడుల్లో ఎక్సైజ్ సీఐలు శారద, బిక్షారెడ్డి, రమణయ్య, ఎస్సైలు వివేక్, సతీష్, బాలరాజుతో పాటు, వెల్దండ ఎస్సై రవి, తెలకపల్లి, అచ్చంపేట ఎక్సైజ్ సీఐలు పాల్గొన్నారు.

పేటలో టాస్క్‌ఫోర్స్ దాడులు

- రూ.6.67 లక్షల గుట్కా ప్యాకెట్ల పట్టివేత

నారాయణపేట, జూన్ 18 : నారాయణపేట జిల్లా కేంద్రంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు కిరాణ దుకాణాల్లో దాడులు నిర్వహించి రూ.6.67 లక్షల విలువ గల గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అశోక్ దుకాణంతో పాటు, గోదాములో రూ.6,44,865 విలువ గల గుట్కా ప్యాకెట్లను, అదేవిధంగా వెంకట్రాములు కృష్ణ కిరాణ దుకాణంలో రూ.13,090 విలువ గల గుట్కా ప్యాకెట్లు, నజీర్‌అహ్మద్ కిరాణ దుకాణంలో రూ.9,120 విలువ గల గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు తెలిపారు. సీఐ శివశంకర్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.


పేటలో పట్టుబడ్డ గుట్కా ప్యాకెట్లు

టిప్పర్, ద్విచక్రవాహనం ఢీ

- వ్యక్తికి తీవ్ర గాయాలు

కల్వకుర్తి టౌన్, జూన్ 18 : టిప్పర్, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం జకినాలపల్లికి చెందిన పోలే వెంకటయ్య ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పట్టణ సమీపంలోని మైసమ్మ గుడి వద్ద టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటయ్యకు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108కు సమాచారమందించి కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వెంకటయ్యను హైదరాబాద్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

బొలెరో, ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

పెద్దమందడి, జూన్ 18 : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ శివారులో సోమవారం రాత్రి ఆటోను బొలెరో వాహనం ఢీకొనడంతో ఆటోలో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మోజర్ల గ్రామానికి చెందిన రాములు గౌడ్(67) తన వ్యవసాయ పొలానికి వెళ్లి రాత్రి ఆటోలో ఇంటికి వస్తున్నాడు. మోజర్ల గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న రాములుగౌడ్ గాయపడగా అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చేయి విరిగిందని డాక్టర్లు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి



జక్కుల మన్యం మృతదేహానికి నివాళులర్పిస్తున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, జూన్18: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన జక్కుల మన్యం, చీర్ల బుచ్చన్న కుటుంబ సభ్యులను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో చీర్ల బుచ్చన్న, శ్రీనివాసపురంలో జక్కుల మన్యంల మృత దేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు మాణిక్యం, నరసింహ, మాధవరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నరేష్, సంపత్ కుమార్, చిట్యాల రాము ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ

వనపర్తి రూరల్, జూన్ 18: వనపర్తి మండలంలోని అంజనగిరి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు శివాజీ యూత్ సభ్యులు నోటు పుస్తకాలు వితరణ చేశారు. దాదాపు 30 మందికి పైగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంజనమ్మ, అంగన్‌వాడీ టీచర్ నాగవేణి, యూత్ సభ్యులు శ్రీశైలం, మహేష్, రవి, ప్రశాంత్, చింటూ, జానకి రాముడు, చరణ్ తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా అర్జున్



వనపర్తి రూరల్, జూన్ 18: వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన అర్జున్ మంగళవారం ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఏబీవీపీ ఈ నెల 15, 16, 17వ తేదీలో వరంగల్‌లో ప్రాంత అభ్యాస వర్గ కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో భాగంగా అర్జున్‌ని వనపర్తి జిల్లా కన్వీనర్‌గా ఎంపిక చేస్తూ ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ప్రకటించినట్లు అర్జున్ తెలిపారు. గతంలో పాలమూరు యూనివర్సిటీలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేశానని, ఈ బాధ్యత ఇచ్చిన రాష్ట్ర శాఖకు ధన్యవాదాలు తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి

- డీఈవో గోవిందరాజులుకు వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు

వనపర్తి రూరల్, జూన్ 18: ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. గతేడాది మాదిరిగా 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రతీ ప్రైవేటు పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు సర్క్యులర్ జారీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు డీఈవో సానుకూలంగా స్పందించి త్వరలోనే సర్క్యులర్ జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు మాల్యాల బాలస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కుమార్, ఆంజనేయులు, తిరుపతయ్య, ముంత రవియాదవ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి



ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

పెబ్బేరు, జూన్ 18: విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని పెబ్బేరు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు సూచించారు. ఆహారపు అలవాట్లు అనే అంశంపై మంగళవారం పెబ్బేరు జడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుంటే మంచి సమాజం నిర్మితమౌతుందని వివరించారు. కూరగాయలు, ఆకు కూరలతో పాటు పాలు, గుడ్లు తీసుకోవడం ద్వారా శారీరక బలహీనతను అధిగమించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ పాఠశాల కోఆర్డినేటర్ డి.కృష్ణయ్య, హెచ్‌ఎంలు శ్రీవిద్య, పుష్పకుమారి, శ్రీనివాస్‌గౌడ్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

రేమొద్దులలో ఇంటింటి సర్వే



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్, జూన్ 18: మండలంలోని రేమొద్దులలో మంగళవారం హెల్త్ అసిస్టెంట్ రాంచందర్ ఆధ్వర్యంలో టీబీ అనుమానిత సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, దగ్గితే చాతిలో నొప్పి, తెమడలో రక్తం పడటం, రాత్రి వేళలో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం అందించే మందులను వాడితే వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. వర్షాకాలంలో మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నిల్వ నీటి ద్వారా దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఈ నెల 20న నులి పురుగుల నివారణ మాత్రలను ప్రతీ విద్యార్థి కచ్చితంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాంతమ్మ, ఆశ కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.

నేటి నుంచి కోటిలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

కొత్తకోట, జూన్ 18 : మండలంలోని కానాయపల్లి బస్టాండ్ సమీపంలో ఉన్న శైవక్షేత్రం కోటిలింగేశ్వరస్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు జరుగు ఈ బ్రహ్మోవాత్సల్లో బుధవారం సంకల్ప సిద్ధి కాలభైరవ పాశుపత హోమాలు, గురువారం కోటిలింగేశ్వరునికి పుష్పాభిషేకం, బిల్వాభిషేకం, శుక్రవారం ఆలయంలోని జ్ఞానాంబికాదేవికి పుష్పాభిషేకం, శనివారం శివపార్వతుల కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కొండ చిలువ పట్టివేత



రంగసముద్రం వద్ద కొండ చిలువతో కృష్ణసాగర్

శ్రీరంగాపురం, జూన్ 18: మండల కేంద్రంలోని శ్రీరంగాపురం రంగసముద్రంలో కొండ చిలువను మత్స్య కారులు చూసి జిల్లా స్నేక్ సొసైటీ సభ్యులు కృష్ణసాగర్ కు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చెరుకొని మత్స్యకారుల సహకారంతో కొండ చిలువను పట్టుకొని వెళ్లారు. ఈ ప్రాంతంలో మరికొన్ని కొండ చిలువలు ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

చట్టాలపై పోలీసులకు శిక్షణ

కొత్తకోట, జూన్ 18 : ప్రభుత్వాలు కొత్తగా తీసుకొచ్చిన చట్టాలపై సర్కిల్ పరిధిలోని పోలీసులకు సర్కిల్ కార్యాలయంలో విడుతల వారిగా జరుగు మూడు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం సీఐ రాంబాబు ప్రారంభించారు. 1860లో ఉన్న ఐపీసీ చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సన్‌హీత పేరుతో కొత్తగా చట్టాలు తీసుకొచ్చారన్నారు. ఆ చట్టం ప్రకారం కేసుల నమోదు, గ్రామాల్లో పోలీసుల పాత్ర, సమస్యలు సృష్టించే వ్యక్తులపై తీసుకునే చర్యలు, రౌడీషీటర్ కేసులు, శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తులపై కేసులు, రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం నిర్వహించుట అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎస్సైలు వెంకటస్వామి, అంజత్, మంజునాథ్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు ఏకరూప దుస్తులు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- తొలి విడతలో సర్కారు బడుల ఆవరణలో ఉన్న కేంద్రాల చిన్నారులకు
- స్వయం సహాయక సంఘాలకు అప్పగించనున్న డీఆర్‌డీవో అధికారులు



అంగన్‌వాడీ విద్యార్థులు (ఫైల్)



ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తాం

ప్రభుత్వం నుంచి తమకు ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం. అంగన్‌వాడీ చిన్నారుల వివరాలు సేకరించి ఏకరూప దుస్తులు పంపిణీ చేసే విధంగా కృషి చేస్తాం.

- నాగేంద్రం, డీఆర్‌డీవో

వనపర్తి రూరల్, జూన్ 18: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనభ్యసించే చిన్నారులకు ఏకరూప దుస్తులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న, సొంత భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు మాత్రమే అందించనున్నారు.

వీటిని కుట్టించే బాధ్యతను జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేస్తామన్న రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారికి ఆ దిశగానే ప్రాధాన్యత ఇస్తున్నది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్ కుట్టించే బాధ్యతను వారికి అప్పగించింది. జిల్లాలోని ఐసీడీఎస్ పరిధిలో మూడు ప్రాజెక్టులు ఉన్నాయి. మొత్తం 1,589 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో మూడు నుంచి 5 సంవత్సరాల లోపు విద్యర్థులు సుమారు 11,788 మంది ఉన్నారు.

ఇందులో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో 182 అంగన్‌వాడీ కేంద్రాలు, 98 కేంద్రాలు సొంత భవనంలో కొనసాగుతున్నాయి. మొత్తం 280 కేంద్రాలలో 4,161 మంది విదాయర్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి మాత్రమే మొదటి విడతలో దుస్తులు అందించనున్నారు. మిగతా 1309 కేంద్రాల్లోన్ని విద్యార్థులకు రెండో విడతలో దుస్తులు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దుస్తులు కుట్టేందుకు జిల్లాలోని 480 మంది స్వయం సంఘాల సభ్యులను ఎంపిక చేశారు. ఒక ఫ్రాక్‌కు రూ.60, బాలుర డ్రస్‌కు రూ.75 చొప్పున కుట్టుకూలి చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే కేంద్రాల వారీగా విద్యార్థుల కొలతలు తీసుకునేలా డీఆర్‌డీవో అధికారులు పని చేస్తున్నారు. వీరితో పాటు గిరిజన సంక్షేమ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో సంక్షేమ వసతి గృహాల్లో చదివే గిరిజన విద్యార్థుల యూనిఫామ్ కుట్టించే బాధ్యతలు సైతం ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒక విద్యార్థికి రెండు జతల చొప్పున దుస్తులు ఇవ్వనున్నారు.



నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న నాయకులు



కొత్తకోటలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

నీట్ పేపర్ లీకేజీకి ప్రధాని బాధ్యత వహించాలి

- ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల డిమాండ్

వనపర్తి టౌన్, జూన్ 18: బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే నీట్ పేపర్ లీకేజీ జరిగిందని, ప్రధాని నరేంద్ర మోదీ లీకేజీలపై బాధ్యత వహించాలని ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నీట్ రద్దు చేయాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి చదువుకున్న విదార్థులకు లీకేజీతో నష్టం జరిగిందన్నారు. విద్యార్థుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, ఒకే కేంద్రంలోని ఆరు గురు విద్యార్థులకు 720 మార్కులు రావడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించి, నీట్ పరీక్షను రద్దు చేయాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, జిల్లా ఇంచార్జ్‌లు రమేష్, గోపాల కృష్ణ, శ్రీరాం, మహేష్, చంద్రశేఖర్, మోహన్, రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విచారణ జరిపించాలి: ఎండీ జబ్బార్

నీట్ అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్‌డీఏ పాలనలో ఉన్నత చదువుల కోసం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో అవకతవ కలు, లీకేజీలు సర్వసాధారణంగా మారాయని విమర్శించారు. విద్యార్థులకు, విద్యార్థుల తల్లి దండ్రులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 20న అన్ని మండల కేంద్రాలలో, జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పార్టీ నాయ కులకు పిలుపునిచ్చారు.

కొత్తకోటలో..

కొత్తకోట : నీట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ నాయకులు కళాశాల విద్యార్థులతో కలిసి మంగళవారం పట్టణ చౌరస్తాలో ఆందోళన చేశారు. నీట్ వెంటనే రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు స్పందించి కేంద్ర వైద్యాధికారులను ప్రశ్నించినా.. కేంద్ర మంత్రులు స్పందించక పోవడం దురదృష్టకరమన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు అక్బర్, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్యామ్, దిలీప్‌రెడ్డి, రాఘవరెడ్డి, రమేష్, కళాశాల విద్యార్థులు ఉన్నారు.

నర్సరీలో మొక్కలను సంరక్షించాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీపీవో రమణమూర్తి

పాన్‌గల్, జూన్ 18: గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీపీవో రమణమూర్తిలు అన్నారు. మంగళవారం మండలంలోని అన్నారం, అన్నారం తండాలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. ప్రతీ రోజు మొక్కలకు వాటరింగ్ చేస్తూ సిప్పింగ్ చేయాలని సూచించారు. హరితహారంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోటేశ్వర్ ఎంపీఓ రఘురాం, పంచాయతీ కార్యదర్శులు పార్వతమ్మ, దివ్య తదితరులు ఉన్నారు.

లక్షా మూడువేల మొక్కలు నాటాలి

ఆత్మకూరు : మండలంలో లక్ష 3వేల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నామని ఏపీవో విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు మండలంలోని 13 గ్రామ పంచాయతీలు ఉండగా గ్రామ జనాభా విస్తీర్ణాన్ని ఆధారం చేసుకుని గ్రామానికి సరిపడా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, ప్రధాన రహదారులకు ఇరువైపులా, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ, సమాంతర కాలువల గట్లపై నాటనున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిర వన మహోత్సవం కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఇంటి పెరట్లో పెంచుకోవడానికి జామ, ఉసిరి, మునగ, సీతాఫలం చెట్లను 16వేల మొక్కలను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకునే విధంగా అవగాహన కల్పించనున్నామని ఆయన తెలిపారు.


పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

అమరచింత, జూన్ 18: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో మంగళవారం అమరచింత మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ రాజన్న మాట్లాడుతూ మునిసిపాలిటీ ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి అయినా అభివృద్ధిలో మాత్రం ముందుకు పోవడం లేదని విమర్శించారు. అభివృద్ధి పనుల్లో చాలా వరకు అవినీతి చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అవినీతిపై విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు కాలనీలలో మురుగు కాలువలు, చెరువు కాలువ, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 6,10 వార్డులలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని వారు కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మునిసిపల్ మేనేజర్‌కు అందించారు. ఈ ధర్నాలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ప్రసాద్, సామెల్, కురుమన్న, అబ్రహం, జిలాని, కిష్టమ్మ, లక్ష్మీ, భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.

ప్రయాణికులకు సరైన వసతులు కల్పించాలి



డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి అర్బన్, జూన్ 18 : మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్ ప్రయాణం కల్పించడం వల్ల పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్‌తో పాటు బస్సుల్లో మెరుగైన వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్ కోరారు. మంగళవారం ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వనపర్తి బస్టాండ్‌లో సరైన మరుగు దొడ్లు, తాగునీటి వసతిలేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థి, విద్యార్థినులకు ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా కొన్ని బస్టాపుల వద్ద మహిళలను చూసి బస్‌లు ఆపకుండా వెళ్తున్నారని అలాంటి సిబ్బందిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురాం పాల్గొన్నారు.

చెత్తపై పన్ను ఎత్తివేయాలి

- అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్

వనపర్తి టౌన్, జూన్ 18: సేకరణ రూపంలో ప్రజలపై వేసిన పన్ను ఎత్తివేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చెత్త సేకరణ వాహనాలకు ప్రతీనెల కొంత డబ్బు చెల్లించేలా గత ఏడాది మునిసిపల్ అధికారులు ప్రజలపై భారం వేశారు. ప్రజలపై పెట్టిన ఈ భారాన్ని తొలగించాలని, ప్రజలు మునిసిపాలిటీకి ఇంటి ట్యాక్స్ రూపంలో కట్టే పన్నులోనే అన్ని కలిపి ఉంటాయని అన్నారు. అలా కాకుండా చెత్త సేకరణ కోసం అదనంగా ప్రజలపై భారం మోపడం సరైన పద్ధతి కాదన్నారు. చట్టంలో లేని వ్యవస్థను ప్రజలపై రుద్దడం ఏంటని ప్రశ్నించారు. గద్వాల మునిసిపాలిటీలో కూడా ఇలాగే ఉంటే అక్కడి చైర్మన్ పన్ను నిలిపివేస్తున్నామని ప్రకటన చేసి ప్రజలకు క్షమాపణ కోరినట్లు తెలిపారు. అదేవిధంగా వనపర్తిలో కూడా చెత్త సేకరణ పన్ను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, సతీష్, ఆంజనేయులు ఉన్నారు.

రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

అమరచింత, జూన్ 18: రైతులందరికీ ఏక కాలంలో రుణమాఫీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అజయ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రెండు లక్షల రుణమాఫీని ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం విడతల వారీగా కాకుండా ఏకకాలంలో రుణమాఫీ చేసి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం అందజేస్తున్న రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు రాజన్న మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు రూ.7,500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా రైతులకు ఇప్పటికీ రైతు భరోసా నిధులు రైతుల వ్యక్తిగత అకౌంట్లో జమ చేయడం లేదు. ఈని ద్వారా రైతులు ప్రైవేటు పెట్టుబడిదారులను ఆశ్రయించి ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉంది. కావునా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షనమే స్పందించి రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ఆయన ఓ ప్రకటన ద్వారా కోరారు.

28న క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 18: రాష్ట్రంలోని వివిధ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈనెల 28న విద్యార్థుల ఎంపిక జరుగుతుందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఉంటాయన్నారు. నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం ఎంపికలు జరుగుతాయన్నారు. విద్యార్థులు 2015 నవంబరు 1వ తేదీ నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలని తెలిపారు. జిల్లాస్థాయి స్పోర్ట్స్ ఎంపికల కోసం విద్యార్థులు తమ వెంట 10 పాస్ ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రం, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, మూడవ తరగతి ప్రొగ్రెస్ రిపోర్టు ఆధార్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాలన్నారు. అన్ని సర్టిఫికెట్‌లు ఒరిజినల్ తో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. ఎత్తు, బరువు, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్టు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 60/10 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. ఈనెల 26వ తేదీ ఉదయం తొమ్మిది గంటలోపు జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణానికి విద్యార్థులు చేరుకోవాలన్నారు. పైన తెలిపిన ఏ ఒక్క ధ్రువ పత్రం లేకున్నా అనుమతి లేదన్నారు. తప్పుడు ధ్రువ పత్రాలు సమర్పిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

వనపర్తి టౌన్, జూన్ 18: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21వ తేదీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు ఏడు, ఎనిమిది వారాల నుంచి కూలీ డబ్బులు కూడా ఇవ్వడం లేదని, ఉపాధి హామీ చట్టానికి అనేక తూట్లు పొడుస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలనే డిమాండ్ల సాధనతో పాటు వ్యవసాయ కూలీల వివిధ సమస్యలపై శిక్షణ తరగతులలో చర్చించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

జీపీ కార్మికులను ఆదుకోవాలి

మదనాపురం, జూన్ 18: గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు నెలలుగా వారికి జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జీతం వస్తేనే జీవనం సాగించే జీపీ కార్మికులను ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరి కాదని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సొసైటీ స్థలాన్ని కాపాడుకుంటాం

- గీత పారిశ్రామిక సహకార సంఘం తీర్మానం

అమరచింత, జూన్ 18: ఆక్రమణ నుంచి గీత పారిశ్రామిక సహకార సంఘం స్థలాన్ని కాపాడుకుంటామని ఆ సంఘం సభ్యులు సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. మంగళవారం గీత పారిశ్రామిక సహకార సంఘం అమరచింత అధ్యక్షుడు అశోక్ గౌడ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 4-2లో గల కల్లు దుకాణ స్థలాన్ని సొసైటీకి తెలియకుండా ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీన్ని సంఘం సభ్యులు అందరం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సొసైటీ సభ్యులు లచ్చన్న గౌడ్, తిమ్మన్న గౌడ్, గిరినాథం గౌడ్, కృష్ణయ్య గౌడ్, లింగమ్మ, సరోజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.